క్లుప్తంగా

పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రితో భేటీ


మంత్రిని కలిసిన సునీల్‌కుమార్

పూతలపట్టు: నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తిరుపతిలోని మంత్రి నివాసంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సోమవారం జరిగిన ఎన్నికలకు సంబంధించి చర్చించారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసి పోలింగ్ సరళిని వివరించారు. వీరితో పాటు నాయకులు ప్రకాష్‌రెడ్డి, నరోత్తమరెడ్డి తదితరుల ఉన్నారు.

పూతలపట్టులో 87.66 శాతం పోలింగ్

కాణిపాకం: పూతలపట్టు నియోజకవర్గంలో సోమవారం రాత్రి వరకు పోలింగ్ కొన సాగింది. దీంతో 87.66 శాతం పోలింగ్ నమోదైంది. నియోజవర్గ వ్యాప్తంగా 2,20,999 మంది ఓటర్లు ఉండగా 1,93,730 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 1,08,811 మంది ఓటర్లు ఉండగా 95,962 ఓట్లు పడ్డాయి. అలాగే స్త్రీ ఓటర్లు 1,12,181 మంది గాను 97,767, ఇతర ఓటర్లు 7 మందికి ఒకరు ఓటు వినియోగించుకున్నారు.

టీడీపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు


టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బంగారుపాళెం: దళితులు, తమ పార్టీ కార్యకర్తలపై దాడి చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టీడీపీ నాయ కులు విక్రమ్, నవీన్ ఆధ్వర్యంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే లలితకు మారి చెందిన కారు అద్దాలు ధ్వంసం చేశారు. దీనిపై లలితకుమారి భర్త థామస్, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డితో కలసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఘనంగా గంగజాతర చాటింపు


ఎల్లదేవతకు పూజ చేస్తున్న ధర్మకర్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలో మంగళవారం నడివీధి గంగజాతరకు చాటింపు వేశారు. ఈ సందర్భంగా ఎల్లదేవతకు ప్రత్యేక పూజలు చేసి, చాటింపు ప్రక్రియను ప్రారంభించారు. అక్కడ నుంచి చాటింపు వేస్తూ వేలూరు రోడ్డు, గాంధీసర్కిల్ మీదుగా బజారువీధిలో ఊరేగింపుగా వచ్చి బజారువీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించే చోట విశేష పూజలు చేశారు. కాగా ఈనెల 21, 22వ తేదీల్లో జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతర వంశపార్య ధర్మకర్త లావణ్య, సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు


పాపసముద్రంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంధ్య జాన్

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్యజాన్ అన్నారు. మంగళవారం పాపసముద్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, మధుమేహం రోగులతోపాటు సాధారణ రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కవిత, చంద్ర, బుజ్జమ్మ, ప్రభావతి, రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రతిభ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ యోగానంద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ అకాడమీ విద్యార్థులు వీవై. జెశ్వంత్ (ఎంపీసీ) 1635, బెశ్వంత్ 2537, వేదప్రకాష్ 3830, రితిక 4462 ర్యాంకులు సాధించారని చెప్పారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

‘ఆమె’దే ధీమా!

- చిత్తూరులో కీలకంగా మారిన మహిళా ఓటర్లు
- సంక్షేమ పథకాలపై సానుకూలతే ఓటుగా తీర్పు
- గత ఎన్నికలతో పోలిస్తే ఓటర్లలో చైతన్యం
- ఫలితంగా చిత్తూరులో 81.24 శాతం పోలింగ్
- పురుషుల కంటే పెరిగిన మహిళల ఓట్లు


ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

చిత్తూరు అర్బన్: రెండు రోజుల క్రితం చిత్తూరు నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు మరోమారు అధికార పార్టీకు పట్టం కట్టనుందా..? పోలింగ్ శాతం పెరగడమే ఇందుకు కారణమా..? పురుషులతో పోలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం ప్రభుత్వానికి సానుకూలతేనా..? మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు పట్టం కట్టడానికి ఇవి సంకేతాలా..? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఎప్పుడూ లేనివిధంగా చిత్తూరులో పోలింగ్ 81 శాతం దాటడం కొత్త రికార్డును సృష్టించింది. ఇది ముమ్మాటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకు అనుకూలమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పెద్ద సంఖ్యలో ఓటర్లు

మామూలుగా చూసినట్లయితే పోలింగ్ జరిగే సమయంలో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఓమోస్తరుగా ఓటర్లు క్యూ కడుతారు. దాని తరువాత సాయంత్రానికి గానీ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రారు. అయితే సోమవారం జరిగిన పోలింగ్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా చాలా కేంద్రాల్లో క్యూలు కనిపించాయి. ఇంకా చెప్పాలంటే నగర పరిధిలోని కొంగారెడ్డిపల్లె, సంతపేట, రామ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. గుడిపాలలో సాయంత్రం 5 వరకు కూడా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు పెద్ద సంఖ్యలో కనిపించారు. చిత్తూరు మండలంలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 6 గంటల వరకు క్యూలలో ఉన్న ఓటర్ల వారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు.

పెరిగిన శాతం

2014 ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 6 శాతం, గత ఎన్నికల్లో బేరీజు వేసుకుంటే 2 శాతం పోలింగ్ పెరిగింది. ఈసారి జరిగిన ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గ పరిధిలో 2,02,850 మంది ఓటర్లు ఉంటే 1,64,788 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 84,278 మంది మహిళలు, 80,493 పురుషులు, 17 మంది ఇతరులు ఉన్నారు. పూర్తిస్థాయి పోలింగ్ ముగిసాక.. చిత్తూరు నియోవజకవర్గంలో 81.24 శాతం ఓటింగ్ నమోదైందని మంగళవారం అధికారులు ప్రకటించారు.

‘ఆమె’ కీలకం

చిత్తూరులో పోలింగ్ శాతం పెరగడంపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందులోనూ మహిళా ఓటర్లు పోటెత్తడం ఇక్కడ అభ్యర్థి గెలుపులో కీలకపాత్ర పోషిస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా క్యూలలో వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే మహిళలు పెద్ద సంఖ్యలో రావడం వెనుక.. ప్రభుత్వం నుంచి అందుకున్న సంక్షేమ పథకాలకు తోడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడాలని తీర్పు ఇవ్వడానికేనని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు, యువత, పురుషులు సైతం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిను విశ్వసిస్తుండడంతో పాటు చిత్తూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి చేసిన, చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు అండగా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మరో 21 రోజులు ఆగాల్సిందే

పోలింగ్ పూర్తవడంతో ఇక ఫలితాలపై సర్వత్రా ఆసక్తి రేపుతోంది. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే మే 13న పోలింగ్ పూర్తయ్యింది. అయితే ఫలితాలు మాత్రం జూన్ 4న వెలువడనున్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని దశల పోలింగ్ పూర్తయిన తరువాతే ఫలితాలు వెల్లడించాల్సి ఉండడంతో మరో 21 రోజులకు అటు అభ్యర్థులు.. ఇటు ప్రజలకు వేచి చూడక తప్పదు.

గత మూడు ఎన్నికల్లో పోలింగ్ సరళి ఇలా..

2014		2019		2024	
మొత్తం ఓటర్లు	1,92,535	మొత్తం ఓటర్లు	1,93,089	మొత్తం ఓటర్లు	2,02,850
పోలైన ఓట్లు	1,45,883	పోలైన ఓట్లు	1,53,206	పోలైన ఓట్లు	1,64,788
శాతం	75.52	స్త్రీలు	78,031	స్త్రీలు	84,278
--	--	పురుషులు	75,166	పురుషులు	80,493
		ఇతరులు	9	ఇతరులు	17
		శాతం	79.34	శాతం	81.24

ఏజెంట్ కుటుంబానికి అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి


పరామర్శిస్తున్న బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

పూతలపట్టు: పోలింగ్ బూత్‌లో వైఎస్సార్ సీపీ ఏజెంట్ హరిబాబు కుటుంబానికి అండగా ఉంటామని ఆ పార్టీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో తెలుగు తమ్ముళ్ల దాడిలో హరిబాబు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. సోమవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న హరిబాబును బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌తో కలిసి, పరామర్శించారు. పార్టీ, నాయకులు హరిబాబు కుటుంబానికి అండగా ఉంటామని మాటిచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారిని నాయకులు వదలరని, వారికి అన్ని విధాల తోడుంటామని తెలిపారు. అనంతరం దాడి చేసిన తెలుగు తమ్ముళ్లపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు చంద్రా తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మా.. వర్షాలు కురిపించమ్మా!


బసవాపల్లెలో పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: వర్షాలు పుష్కలంగా కురిపించి, పంటలు సమృద్ధిగా పండేలా దీవించాలని కోరుతూ మంగళవారం మండలంలోని బసవాపల్లె గ్రామస్తులు సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి, ప్రత్యేకంగా అలంకరించి, మొక్కుల చెల్లించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. పలువురు వివిధ వేషధారణతో ఆకట్టుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే కుప్పిగానిపల్లెలో గంగమ్మకు గ్రామస్తులు మొదటి వారం అంబలి పోసి, పొంగళ్లు పెట్టారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లకు నిరంతర విద్యుత్

- ట్రాన్స్‌కో ఏఈలకు డ్యూటీలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని ఈవీఎంలు భద్రపరచిన కేంద్రానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. రోజూ రెండు షిఫ్టుల్లో ఏఈలు అందుబాటులో ఉంటారని, ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు వారు పరిష్కరిస్తారన్నారు. వీరు జూన్ 4 వరకు విధులు నిర్వర్తిస్తారని చెప్పారు. జీడీనెల్లూరు, పైపల్లె, కేఆర్‌పల్లె, సంతపేట, పెనుమూరు, అరగొండ, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, గిరింపేట, రెడ్డిగుంట, పలమనేరు రూరల్, బైరెడ్డిపల్లె, ఐరాల రూరల్, ఐరాల ఆపరేషన్, మిట్టూరు, కొత్తపల్లె, కార్వేటినగరం, పలమనేరు ఆపరేషన్, వి.కోట, యాదమరి, బంగారుపాళ్యం ఆపరేషన్, రూరల్, పూతలపట్టు, బంగారుపాళ్యం ఆపరేషన్, పాలసముద్రం, పైపల్లె, సంతపేట, కేఆర్‌పల్లె, పెనుమూరు, అరగొండ, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, రెడ్డిగుంట, గిరింపేట, బైరెడ్డిపల్లె, పలమనేరు రూరల్, ఐరాల ఆపరేషన్, రూరల్, పలమనేరు ఆపరేషన్, కార్వేటినగరం, యాదమరి, వి.కోట, పూతలపట్టు, బంగారుపాళ్యం రూరల్.. ఇలా మొత్తం 44 షిఫ్టుల్లో ఏఈలు పనిచేస్తారన్నారు. వీరిని ఈఈలు హరి, పద్మనాభపిళ్లై పర్యవేక్షిస్తారన్నారు.

గర్భిణులు ఐరన్ మాత్రలు వాడాలి

- వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు


పట్నంలో వృద్ధులను పరీక్షిస్తున్న మోహన్‌వేలు

తవణంపల్లె: రక్తహీనత నివారణకు గర్భిణులు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు అన్నారు. మండలంలోని పట్నంలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు.

సరకల్లులో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని సరకల్లులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్ కుమార్ రోగులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, వరలక్ష్మి, నాగభూషణం పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి సూచించారు. మండలంలోని చిగరపల్లె పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు.. మందుల నిల్వ, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కామినాయనపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలందుతాయని పేర్కొన్నారు. ప్రతి నెలా వైద్య బృందం రోజంతా గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారి స్వాతిసింధూర, డాక్టర్ రాజేశ్వరి, పీహెచ్ఎన్ యాదవతి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ పద్మిని, ఎల్‌టీ హరిత పాల్గొన్నారు.

టీడీపీ రచ్చ.. రచ్చ

- పూతలపట్టులో అల్లర్లు, గొడవలు, దౌర్జన్యాలు
- పలుచోట్ల రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నం
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి

కాణిపాకం: పూతలపట్టులో టీడీపీ నాయకులు రచ్చ..రచ్చ చేశారు. ఓట్లు కొల్లగొట్టేందుకు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అల్లర్లు సృష్టించి..వివాదాలకు దారితీసేలా ప్రవర్తించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడులు చేశారు. దీంతో పలువురు ఆస్పత్రి పాలయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పలుచోట్ల రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. అయితే బూత్‌ల్లోని అధికారుల పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. పూతలపట్టు మండలంలో కొన్ని బూత్‌ల్లో టీడీపీ నాయకులు అడ్డగోలుగా వ్యవహరించారు. పూర్తి స్థాయిలో ఓట్లు దండుకోవడానికి ప్రయత్నాలు చేశారు. ఓటింగ్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి చివర వరకు కూడా వైఎస్సార్‌సీపీ నాయకులను గొడవలకు లాగారు. బూత్ ఏజెంట్లను సైతం బెదిరించారు. రక్తమొచ్చేలా కొట్టారు.

- పేటాగ్రహారం బూత్‌లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ రవినాయుడుపై దాడి చేశారు. పోలింగ్ బూత్‌కు వెళ్లక ముందే అడ్డగించి చితకబాదారు. అయినా రవినాయుడు ఆ దెబ్బలతోనే బూత్‌లో ఏజెంట్‌గా వ్యవహరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ ఈ విషయం తెలుసుకుని బూత్ వద్దకు చేరుకున్నారు. కానీ టీడీపీ నాయకులు మహిళను రోడ్డుపైకి తీసుకొచ్చి ఇష్టానుసారంగా వ్యవహరించారు.
- పేటపల్లి బూత్‌లో కూడా వైఎస్సార్‌సీపీ ఏజెంట్ గురుస్వామి నాయుడుపై పచ్చనేతలు కర్రతో దాడి చేశారు. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు.
- వావిల్‌తోట సీఎం కండ్రిగ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్ హరిబాబును సైతం చితకబాదారు. ముఖంపై పిడిగుద్దులు గుద్దారు. శరీరమంతా గాయాలయ్యాయి. దాడి చేసిన టీడీపీ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.
- బందార్లపల్లె, చిటిపిరాళ్ల, పాలకూరులో రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ ఎప్పటికప్పుడు స్పందించారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన గొడవకు దారితీసింది.
- బంగారుపాళెం, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాల్లో అక్కడక్కడ తేలిక పాటి ఘర్షణలతో ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎప్పటికప్పుడు పోలీసులు స్పందించడంతో అక్కడ పెద్దగా సమస్యలు, గొడవలు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా ముగించారు.

ఓట్లు దోచుకోవడమే అజెండా...

మరోమారు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభంజనం సృష్టించడంతో టీడీపీలో వణుకుపుట్టింది. జనమంతా సంక్షేమాన్ని చూసి ఓట్లేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రచారంలో జన సందడి చూసి, ఓటమి భయం పట్టుకుంది. ఈ కారణంగా నియోజకవర్గంలో అల్లర్లకు పాల్పడేలా ముందస్తు ప్రణాళికలు రచించారు. రెచ్చగొట్టేలా వ్యవహరించాలని బడా నాయకులు తమ్ముళ్లకు ఆదేశాలిచ్చారు. దీంతో చాలా చోట్ల టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఏకంగా బూత్ ఏజెంట్లనే టార్గెట్ చేశారు. వారి దాడి చేసి భయపెట్టాలని చూశారు. ఓట్లు దోచేకోవడమే అజెండాగా ముందుకు వెళ్లారు.

టీడీపీ దౌర్జన్యకాండ


పహారా కాస్తున్న పోలీసులు

- పెరుమాళ్లకండిగ్రలో పచ్చనేతల ఓవరాక్షన్
- బూత్‌కెళ్లే మార్గంలో పందిరి వేసిన వైనం
- ఓ మహిళపై దురుసుగా ప్రవర్తన
- ఆపై మహిళ ఇంటిపై దౌర్జన్యం
- అడ్డుకున్న వారిపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి
- కారు ధ్వంసం
- పహారా కాసిన పోలీసులు


ధ్వంసమైన కారు

చిత్తూరు రూరల్: అధికార దాహంతో టీడీపీ సార్వత్రిక ఎన్నికల్లో కుట్రలకు తెరలేపింది. ఓట్ల కోసం దౌర్జన్యానికి దిగింది. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించడమే కాకుండా దాడులకు సైతం దిగింది. ప్రధానంగా ఇలాంటి ఘటనలతో పెరుమాళ్ల కండ్రిగలో సోమవారం రాత్రి వరకు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వివరాలు..చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలో సోమవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై టీడీపీ నాయకులు దాడికి దిగారు. కారణం..టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి పోలింగ్ బూత్‌కు 30 అడుగుల దూరంలో పందిరి వేసి రోడ్డుకు ఇరువైపులా కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. దీంతో బూత్‌కు వెళ్లే ఓటర్లకు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు. ఓ మహిళ(వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు) దీనిని ప్రశ్నించింది. దీంతో ఓ టీడీపీ నాయకుడు రెచ్చిపోయి..ఆమెను నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. ఈ ఘటన వివాదానికి దారితీసింది. టీడీపీ నాయకులు ఏకమై ఆ మహిళ ఇంటిపై దాడికి దిగారు. ఇంతలో ఆమెను కాపాడేందుకు వచ్చిన వారిపై కూడా టీడీపీ నాయకులు చేయి చేసుకున్నారు. ఇది కాస్తా ముదిరి ఉద్రిక్తతకు దారితీసింది. ఇంతలో పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న పందిరిని తొలగించారు. దీనిని అవకాశంగా చేసుకుని పచ్చమూకలు రిగ్గింగ్‌కు స్కెచ్ వేశాయి. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కొంత మంది బూత్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే టీడీపీ నాయకులు పెరుమాళ్ల కండ్రిగ గ్రామం వద్దే వాళ్లను అడ్డుకుని కొయ్యలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన స్టాన్లీ అనే అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు అద్దాలను పగలగొట్టారు. పెరుమాళ్ల కండ్రిగలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసాద్ నాయుడు ఇంటిపై కూడా దాడి చేశారు. రాళ్ల వర్షం కురిపించారు. ఇంట్లో సామాన్లను ధ్వంసం చేశారు. అంతేకాకుండా పక్క గ్రామాల్లోని టీడీపీ నాయకులను, చిత్తూరు నుంచి రౌడీలను రప్పించారు. వారంతా ఇనుపరాడ్లు, కొయ్యలతో ఇక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ నాయకులను చెదరగొట్టారు. రాత్రంతా పహారా కాశారు. అయితే పరామర్శ పేరుతో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌రెడ్డి పచ్చమూకలను మరింత రెచ్చగొట్టారు. ఆయన రాకతో గ్రామంలో పచ్చమూకల ఆగడాలు శృతి మించేలా ఉంటున్నాయి.

వైఎస్సార్‌సీపీకి 15 వేలు మెజారిటీ ఖాయం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, హాజరైన నాయకులు

- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి


తవణంపల్లె: పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ 15 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమ ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి. ప్రకాష్‌రెడ్డి జోస్యం చెప్పారు. మంగళవారం తవణంపల్లెలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు హరిరెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎన్నికల పోలింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడి పని చేశారన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయి, ఫలితాలు వచ్చిన తర్వాత విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి, సీనియర్ న్యాయవాది కిషోర్‌కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, శరత్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రమేష్‌నాయుడు, సుకేష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జాతరకు విద్యుత్ ముందుస్తు అనుమతి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఏర్పాటు చేయనున్న గంగమ్మ జాతర మండపాలకు ముందుస్తు విద్యుత్ అనుమతి తీసుకోవాలని ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి సోమవారం తెలిపారు. జాతర ఏర్పాటు పనులు పలు ప్రాంతాల్లో ప్రారంభం కానున్న సందర్భంగా తాత్కాలిక అనుమతులతో పదిరోజుల పాటు విద్యుత్ వాడుకోవచ్చన్నారు. ఈ మొత్తాన్ని మీ–సేవ లేదా స్థానిక విద్యుత్ కార్యాలయాల్లో చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు.

లోడ్‌వాట్లు	చెల్లించాల్సిన మొత్తం	లోడ్‌వాట్లు	చెల్లించాల్సిన మొత్తం
500	రూ.1150	3000	రూ.5400
1000	రూ.2400	3500	రూ.6150
1500	రూ.3150	4000	రూ.6900
2000	రూ.3900	5000	రూ.8400
2500	రూ.4650	6000	రూ.9900
		10000	రూ.15900

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య


భరత్‌కుమార్ మృతదేహం


కృష్ణమూర్తి మృతదేహం


బంగారుపాళెం: మండలంలో మంగళవారం వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని తుంబకుప్పం గ్రామానికి చెందిన చంద్రమౌళి కుమారుడు భరత్‌కుమార్(42) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వయసు మీరుతున్న ఇంకా వివాహం కాలేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక మరొకరు..

కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి వడిశాకు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కాటప్పగారిపల్లెకు చెందిన కన్నయ్య కుమారుడు కృష్ణమూర్తి(42)మేస్త్రీగా పనిచేసున్నాడు. కొన్ని రోజుల క్రితం అపెండిక్స్ ఆపరేషన్ చేసుకున్నాడు. అప్పటి నుంచి తరచూ కడుపునొప్పి వస్తుంది. మంగళవారం కడుపునొప్పి రావడంతో ఆ బాధ తాళలేక వడిశాకు తిన్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ మల్లెమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చల్లంగా చూడు గంగమ్మ తల్లీ

- భక్తిశ్రద్ధలతో గంగజాతర


సత్యమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో గంగమ్మ జాతరను మంగళవారం ప్రారంభించారు. ఉదయం భక్తులు సత్యమ్మకు పసుపు కుంకుమ, సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి అంబళ్లు పోసి, కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.


అంబళ్లు పోస్తున్న భక్తులు